# రండి మాట్లాడుకుందాం..

- మాటామంతీ, వ్యూహ ప్రతివ్యూహాలు అక్కడే..
- ఆర్థికపరమైన అంశాల చుట్టూనే ఎత్తుగడలు
- సామాజిక వర్గాల వారీగా ఎత్తులు, పైఎత్తులకు సిద్ధం
- పండుగే అసలైన వేదిక.. ప్రత్యేక ఏర్పాట్లు
- తెలంగాణ, జిల్లాల నుంచి ముఖ్యుల రాక

## ఊళ్లకు ఎన్నికల పందెం కోళ్లు



'రండి మాట్లాడుకుందాం ఇక సమయంలేదు. ఇప్పటికిప్పుడే అన్నీ మాట్లాడుకుంటే తప్ప సవ్యంగా ఒడ్డెక్కలేం. చేతిలో సరుకు తక్కువగానే ఉంది. ఏది కావాలో, ఏది వద్దో మీసాయమూ కావాల్సిందే. పండుగ పూట కాబట్టి మనం ఎక్కడ కూర్చుని మాట్లాడుకున్నా ఎవరికీ అనుమానమే రాదు'.

'పండుగకు అందరూ రండి.. మన టీమ్‌ను కూడా తీసుకురండి. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. చెరువు గట్లో, గెస్ట్‌హౌస్ కానేకాదు. ఈ మూడు రోజులు ఓ ఇంట్లోనే మీ బస. అన్నీ అక్కడే. సీరియస్‌గా మాట్లాడుకోవాల్సినవి ఉన్నాయి పార్టీపరంగా కొన్ని అనుమానాలు తీర్చుకోవాల్సి ఉంది. అన్నిటికంటే మించి ఈసారికి మీరు సర్దుబాటు చేయాల్సిందే. మనస్సు విప్పి మాట్లాడుకుందాం'.

'జెండాలకేం పని. సంక్రాంతి వచ్చిందంటే కోడి పందేలదే కదా. అందరూ చుట్టాలే. పార్టీపరంగా అవసరమేలేదు. మనం మిత్రులుం కాబట్టి ఒకరినొకళ్లు చూసుకుని మాటామంతీ పంచుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితులన్నీ అడ్డగోలుగా ఉన్నాయి. రాజకీయమంటే అందరికీ డబ్బే కావాలి. బంధువులైతే ఎప్పుడో చేతులెత్తేశారు. ఇక స్నేహితులుగా మీలాంటి వాళ్ల మీదే ఆశలు'.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఈ సంక్రాంతి పండుగంతా ఎన్నికల పండుగే. మిత్రులైనా, శత్రువులైనా పందెం బరిలోను, పందెం బరి బయట ఈ మూడు రోజులు ఒకటవ్వబోతున్నారు. ఆర్థిక పరమైన విషయాలపైనే లోతైన ఒడంబడికలు జరగబోతున్నాయి. సామాజిక పరమైన, ఆర్థికపరమైన ఈ రెండింటిని పండుగ బ్రేక్ అప్‌గా భావిస్తున్నారు. గోదారి జిల్లా నేతలంతా ఇతర ప్రాంతాల్లో తమకు తెలిసిన రాజకీయ బంధువులందరికీ వారం క్రితమే ఆహ్వానాలు పలికారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే మర్యాదలకు, కోడి పందేలకు గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. ఇదే తరుణంలో రాజకీయ నేతలంతా తమ తోటి, అనుకూల రాజకీయ బంధువులందరినీ గోదావరి జిల్లాలకు ఆహ్వానం పలకడం ఆనవాయితీ. ఈసారి ఈ పిలుపులో 'ఆర్థిక' వేట ఉంది. నిన్నమొన్నటి వరకు పందేల్లో 'రిలాక్స్' కోసం వచ్చే బంధువులంతా ఈసారి కాస్త ఎన్నికల టేస్ట్ చూడబోతున్నారు.

### అంతా గుట్టుగట్టుగా..

ఎన్నికలకు పట్టుమని వంద రోజులు గడువు లేదు. రాబోయే ఎన్నికలు అత్యంత ఖరీదైనవి కూడా. ప్రధాన పక్షాల నుంచి పోటీ చేయాలనుకుంటున్న వారంతా తమ ఆర్థిక 'బరువు'పై తంటాలు పడుతున్నారు. ఆయా పార్టీల అధినాయకత్వాలు .. మీరెంత భరిస్తారు, అకౌంట్ సిద్ధంగా ఉందా, అనుకున్న పెట్టుబడి ఉంటేనే వ్యవహారం లేదంటే.. అంటూ సంకేతాలు ఇచ్చేశారు. వచ్చే ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి ఎన్నికల పెట్టుబడి దాదాపు రూ.30 కోట్లు దాటబోతుంది. దీంతో ఆశావహులంతా ఇప్పటి నుంచే డబ్బు వేటలో పడ్డారు. ఈ కారణంగానే ఇప్పటికే కాస్త హంగు, ఆర్భాటం ఉన్న తమ మిత్రులతో చర్చించి ఎన్నికల 'సర్దుబాటు'కు వీలైనంత మేర సాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో తమం తట తాముగా ఫైట్ చేయాల్సిన పరిస్థితులు ఉన్నందున ఎవరుమటుకు వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీనికి సంక్రాంతి పండుగనే వేదికగా ఎంచుకున్నారు. పండుగకు రావాల్సిందిగా పదేపదే ఆర్థికస్తోమత ఉన్న, అంగ బలం ఉన్న ఇరుగుపొరుగు ప్రాంతాలకు చెందిన వారిని ఆహ్వానిస్తున్నారు. తెలంగాణలో తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో దాదాపు అరడజను మంది భీమవరం వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వీరుకాక హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, ముంబై ప్రాంతాలకు చెందిన మరికొంద రు ఆర్థిక స్తోమత కలిగిన వారు మరికొందరు రాబోతున్నారు. కోడి పందేల బరిలో విచ్చలవిడిగా తిరిగితే పది మందికి తెలియడం ఇష్టంలేని వారంతా తమకు అనువైన 'డెన్' సమకూర్చాల్సిందిగా కబురు పంపారు. ఇంతకుముందు చెరువుగట్ల మీద, గెస్ట్‌హౌస్‌లు, ప్రధాన హోటల్ రూమ్‌లలో మాటామంతీ పంచుకునేవారంతా దానిని మార్చి ఇప్పుడు 'సొంతింటి'వైపు మళ్లారు. పండుగ మూడు రోజులు ఆ ఇంట్లోనే అంతా. ఇంట్లో వాళ్ళందరినీ పుట్టిళ్లకు పంపేసి కొన్ని ప్రత్యేక ఇళ్లను సిద్ధం చేయిస్తున్నట్టు సమాచారం. వారి వాహనాలన్నీ వేరే చోట పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత గుట్టెందుకని ఎవరైనా ప్రశ్నిస్తే.. అసలే పరిస్థితులు బాగోలేదుకదా తమకు సాయం చేస్తున్నారని వచ్చి అవతలివాళ్లపై ఇంకేమైనా చేయొచ్చు. అందుకే గుట్టుగా లాగించేస్తే వాళ్ల పని అయిపోతుంది, మా పని పూర్తవుతుందని తమ ముఖ్యులకు చెబుతున్నారు. గతంలో ఆక్వాలో ఆరితేరిన దిగ్గజాలే మాటవరుసకు ఎన్నికల పెట్టుబడి పెట్టేవి. ఇప్పుడు ఆక్వా పరిస్థితులు అంతంతగా మారడంతో అందరి దృష్టి ఎన్నికల పెట్టుబడి పెట్టే 'పెద్ద'లవైపు మళ్లింది. అందుకనే ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, కైకలూరు, తణుకు వంటి ప్రాంతాలన్నింటిలోనూ ఎక్కడ కోడి పందేల బరులకు అనుమతి ఇవ్వాలనేదానిపై అధికార పక్షంలోనే మల్లగుల్లాలు పడుతున్నారు. చివరి క్షణంలో కోడి పందేల రాబడి కూడా పోగొట్టుకోవడానికి వైసీపీ నేతలెవరూ సిద్ధంగాలేరు. ఎప్పటి మాదిరిగానే అధినాయకత్వాన్ని ఒప్పించి మూడు రోజుల పండుగకు అలవోకగా సిద్ధమైపోతున్నారు. ఇప్పుడు పెట్టుబడి కోసం తాపత్రయపడే వారిలో వైసీపీ అను కూలురు ఉండడం మరో విశేషం.


## తరలి వస్తున్న అక్రమ మద్యం

ఏలూరు క్రైం, జనవరి 13 : అక్రమ మద్యం, సారా తయారీ విక్రయాలు అరికట్టడంలో రాష్ట్రంలో ఎస్ఈబీ అధికారులు వైఫల్యం చెందారని ఎన్నికల కమీషన్ సీరియస్ అవ్వడంతో చూస్తే ఆశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఏలూరు జిల్లా పరిస్థితిని పరిశీలిస్తే ఉన్న సిబ్బంది పైనే భారం పడి సతమతమవుతున్నారని తెలుస్తోంది. బెల్టు షాపులు చాపకింద నీరులా వెలుస్తున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో అక్రమ మార్గంలో మద్యం తీసుకొచ్చేవారు ఇప్పటికే మద్యాన్ని జిల్లాలోకి తెచ్చినట్టు తెలుస్తోంది. నాగిరెడ్డి గూడెం, కొల్లేరులో యథేచ్ఛగా సారా తయారు చేస్తూ విక్రయిస్తూనే ఉన్నారు. తెలంగాణలో మద్యం ధరలు తక్కువగా ఉండడంతో పాటు ఇక్కడ దొరకని కొన్ని బ్రాండ్లను అక్రమ మార్గంలో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. యానాం, గోవా నుంచి మద్యాన్ని తెస్తున్నారు. రానున్న ఎన్నికలు దృష్ట్యా అక్రమ మద్యం ఏరులైపారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు జీలుగుమిల్లి సమీపంలోని తాటాకులగూడెం, చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం, చింతలపూడి సమీపంలో మరో చెక్ పోస్టు ఉంది. ఏలూరు, భీమడోలు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు, పోలవరంలో ఎస్ఈబీ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. సిబ్బంది అంతతమాత్రమే. ఒక్కొక్క ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు మండలాలు ఉండడంతో నిఘాలో వైఫల్యం అవుతున్నారు. జిల్లాలో రెండు టాస్క్‌ఫోర్స్ ఎస్ఈబీ టీమ్‌లు పని చేస్తున్నాయి.



## కత్తులు దూసేందుకు కోళ్లు సిద్ధం

ఏలూరు రూరల్ : కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. కత్తులతో కోళ్లు, పందేలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈసారి భారీగానే కోడిపందేలు జరిగేలా నాయకులు ఏర్పాట్లు చేశారు. పందేలకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరిస్తున్నా ఖాతరు చేయడం లేదు. ఏలూరు రూరల్ మండలం పరిధిలో జాలిపూడి, కోడేలు, తేటపర్రు, గుడివాక లంక, శ్రీపర్రు, పత్తికోళ్ళలంక, పైడిచింతపాడు పరిధిలో కోడిపందేలు వేసేందుకు బరులు దాదాపు సిద్ధమయ్యాయి. నిర్వాహకులు కొన్ని ప్రదేశాలను ఎంపిక చేసుకుని జూదరులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నట్టు తెలిసింది. బుట్టాయగూడెం ఏజెన్సీలో బరులు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే పందెంరాయుళ్ల కోసం సర్వం సిద్ధం చేశారు. నిడమర్రు, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి తదితర మండలాల్లో మూడురోజులు కోడిపందేలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రుళ్లు పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం గమనార్హం. చాలాచోట్ల అధికార పార్టీ నాయకుల అండదండలతోనే నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నారు. జీలుగుమిల్లిలో బరి విషయమై జనసేన-వైసీపీ కార్యకర్తలకు వాగ్వాదం జరిగింది.



దుద్దుకూరులో కోడి పందేల బరి



అల్లూరు వద్ద బరి ఏర్పాట్లు



# పండగొచ్చింది..

## జిల్లా అంతటా సంక్రాంతి సందడి

- ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు
- రైళ్లల్లోనూ కిక్కిరిసిన ప్రయాణాలు
- ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఏలూరు
- జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- టోల్‌గేట్ వద్ద హ్యాండ్ సెన్సార్ల వాడకం

ఏలూరు-ఆంధ్రజ్యోతి :

కరోనా తర్వాత తొలిసారిగా జిల్లాలో పండుగ శోభ కనిపిస్తోంది. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఎటు చూసినా పండుగ వాతావరణం కన్పిస్తోంది. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. పండుగ నేపథ్యంలో ఏలూరు నగరంలోని షాపింగ్ మాల్స్‌కు ప్రజలు క్యూలు కడుతున్నారు. డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నా లేకున్నా కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు. రోడ్లపై ఎటు చూసినా ఖరీదైన కార్లు, ఒక్కొక్కరి చేతిలో నాలుగైదు షాపింగ్ బ్యాగులు, ప్రధాన రహదారుల్లో అడుగు తీసి అడుగు వేయలేనంత ట్రాఫిక్‌తో ఏలూరు నగర రహదారులు కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ స్థలాలు లేక వాహన యజమానులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతుండగా, ట్రాఫిక్ అధికారులకు చలానాల పంట పండుతోంది. ఏలూరు కోర్టు సెంటర్ నుంచి ఆర్ ఆర్ పేట మీదుగా పవర్‌పేట గేటు వరకు, వన్‌టౌన్ బిర్లా భవన్ సెంటర్, పెద్ద మార్కెట్ మెయిన్ బజార్, ఎన్ఎస్ మార్కెట్ రహదారులన్నీ వాహన, ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. మరోవైపు ఆర్టీసీ ప్రయాణికుల వెతలు అన్నీ ఇన్నీ కావు. బస్సులేక బస్టాండ్‌లో ప్రయాణికుల గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. జిల్లాలోని 196 రూట్లలో అన్ని రకాల బస్సులు కలిపి 216 తిరుగుతుంటాయి. ప్రస్తుతం పండుగ సీజన్ దృష్ట్యా అధికారులు అవే బస్సులను తిప్పుతున్నారు. అధిక టిక్కెట్ ధరలు ఉండే హైదరాబాద్, విశాఖకు మాత్రం అదనంగా బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్‌కు 70, విశాఖకు మూడు ప్రత్యేక బస్సులను నిర్వహిస్తున్నారు. ఆ కారణంగా జిల్లా వ్యాప్తంగా ఇతర పాంతాలకు వెళ్లాల్సిన బస్సులకు కోత పడింది. హైదరాబాద్, విశాఖకు బస్సులు చాలని క్రమంలో ప్రైవేటు బస్సుల యజమానులు టిక్కెట్ ధరలను భారీగా పెంచేశారు. హైదరాబాద్ ఆర్టీసీ ధర రూ.750 ఉండగా, ప్రైవేట్ ట్రావెల్స్‌లో రూ.2,500 నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తున్నారు. విశాఖకూ ఆర్టీసీ ధర కంటే మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూడు డిపోల పరిధిలో 120 ప్రత్యేక బస్సులు ఉండగా, ప్రస్తుతం అవన్నీ హైదరాబాద్, విశాఖకే మళ్లడంతో, మిగిలిన అరకొర బస్సులు కాస్తా జనరల్ సర్వీసుల్లో తిరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో రోజుకు 50 వేల మంది ప్రయాణిస్తుండగా, ప్రస్తుతం అదనంగా మరో 30 వేల మంది ఏలూరు నగరం, జిల్లా మీదుగా ప్రయాణిస్తున్నారు. రైల్వే స్టేషన్లలోనూ అదే స్థాయిలో రద్దీ ఉంది. జనరల్ బోగీలు తక్కువ ఉన్న కారణంగా అధిక శాతం ప్రయాణికులు ప్యాసింజర్ టిక్కెట్లను కొనుగోలు చేసి సెకండ్ క్లాస్ రిజర్వేషన్ బోగీల్లో ఎక్కేస్తున్నారు. ఏలూరు బైపాస్ మీదుగా ప్రతీ పది సెకన్లకు కనీసం 50 వాహనాల వరకు ప్రయాణిస్తున్నాయి. కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలు భారీగా నమోదవుతున్నాయి. ఫాస్ట్ ట్యాగ్ వేయడం ఆలస్యమవుతుండడంతో టోల్‌గేట్ అధికారులు హ్యాండే మెషీన్ల సాయంతో వాహనాలను త్వరితగతిన పంపిస్తున్నారు.



ఏలూరులో ఓ వస్త్ర దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ



కలపర్రు టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ

## పవన్ కల్యాణ్‌తో జోగయ్య భేటీ

పాలకొల్లు, జనవరి 13 : జనసేన నేత పవన్ కల్యాణ్‌ను మంగళగిరి పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ, రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య కలిశారు. సుమారు 2 గంటలసేపు వివిధ అంశాలపై చర్చ జరిగినట్టు జోగయ్య శనివారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు దక్కించుకున్న ఓట్లు ప్రాతిపదికన 2024లో జనసేన అభ్యర్థులు పోటీ పెట్టవలసియున్న నియోజకవర్గాలు 40 నుంచి 60 వరకూ ఉండాలని ఆయనకు చెప్పినప్పటికీ పేర్కొన్నారు. 40 సీట్లు తగ్గకుండా జనసేన తీసుకోవాలని చెప్పారు. ఇక అధికారం పంపిణీ విషయంలో పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే జనసైనికుల ఆకాం క్షను వివరించినట్లు పేర్కొన్నారు. పవన్ పోటీకి దిగవలసిన నియోజకవర్గాల ఎంపికను సూచిస్తూ నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం ఈ మూడింటిని ఆయన దృష్టికి తీసు కెళ్లినట్లు తెలిపారు. ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా చేసే ప్రతిపాదనలో భాగంగా బీజేపీని టీడీపీ-జనసేన కూటమిలో భాగస్వామిగా చేయడం, దానిపై చర్చించగా చేరే అవకాశం మెండుగా ఉందని పవన్ సమాధానం చెప్పినట్లు తెలిపారు.

## ఎంపీ రఘురామకు ఘన స్వాగతం

ఉండి/పాలకోడేరు/వీరవాసరం/పాలకొల్లు టౌన్, జనవరి 13: నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా తన నియోజకవర్గంలో అడుగుపెట్టిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు టీడీపీ-జనసేన శ్రేణులతోపాటు ప్రజలు ఘన స్వాగతం పలికారు. శనివారం ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజుతోపాటు పెద్దఎత్తున నాయకులు, అభిమానులు రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆహ్వానించారు. ఆయనను పూలమాలలతో ముంచెత్తారు. రాజమండ్రి నుంచి భీమవరం వరకు కార్లు, బైక్‌లతో ర్యాలీగా సాగారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి సిద్ధాంతం, రామన్నపాలెం, వడలి, పెనుగొండ మీదుగా జై రఘురామ, టీడీపీ, జనసేన నినాదాలతో తీసుకువచ్చారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం శివారు ఆంజనేయస్వామి విగ్రహానికి ఎంపీతోపాటు శివరామరాజు పూజలు చేశారు. శృంగవృక్షం, పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు గ్రామాల్లో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌కు చేరిన జనసేన కార్యకర్తలు జెండాలతో హల్‌చల్ చేశారు. రఘురామకృష్ణరాజు రాగానే గజమాలతో సత్కరించారు. తూర్పుచెరువుగట్టున ఉన్న దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేయించారు. ఎంపీని ఆహ్వానించేందుకు రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు వంద కార్లతో ర్యాలీగా వెళ్లినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు తెలిపారు. రఘురామను ఆహ్వానించిన వారిలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, టీడీపీ, జనసేన నాయకులు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, బొలిశెట్టి శ్రీనివాస్, కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, బొమ్మిడి నాయకర్, చేగొండి సూర్యప్రకాష్, యర్రగొప్పుల నాగరాజు, శిరిగినీడి రాజ్యలక్ష్మి, పెచ్చెట్టి బాబు తదితరులు స్వాగతం పలికారు. ఎంపీ వెంట ఆయన కుమారుడు భరత్ ఉన్నారు. అడుగడుగునా ఆయనకు అభిమానులు స్వాగతం పలకడంతో రాత్రి తొమ్మిదిన్న తర్వాత ఇంటికి చేరుకున్నారు.



ఎంపీ రఘురామకు గజమాల, చిత్రంలో ఎమ్మెల్యేలు నిమ్మల, మంతెన



ఎంపీ రఘురామకు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే శివ

## ఏటిగట్టు కోత పూడ్చివేత

- నరసాపురం ఎమ్మెల్యే రాజీనామా చేయాలి : బండారు
- పనులపై విచారణ చేయించాలి : పొత్తూరి, కొవ్వలి
- ఎలాంటి అవినీతి జరగలేదు : ముదునూరి

నరసాపురం, జనవరి 13 : కొట్టుకు పోయిన ఏటిగట్టు మరమ్మతు పనులు ప్రారంభించారు. కోతకు గురైన ప్రాంతంలో శనివారం రాత్రి నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో రాళ్లను లోపలకు వేసి పూడ్చుస్తున్నారు. శుక్రవారం పొన్నపల్లి వద్ద చేపట్టిన ఏటిగట్టు పనుల్లో 50 మీటర్ల మేర గట్టు కొట్టుకుపోయింది. దీంతో మిగిలిన గట్టు కోతకు గురై అవకాశం ఉండటంతో ఆ ప్రాంతంలో రాళ్ల వేసి గట్టును పటిష్ఠం చేసే పనులు చేపట్టారు. ఏటిగట్టు శాఖ డీఈ, ఏఈలు పనులను పర్యవేక్షిస్తున్నారు. గట్టుపైకి ఎవరిని వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. పొన్నపల్లి ఏటిగట్టు కొట్టుకుపోవడానికి నాసిరకం పనులే కారణమని, దీనికి బాధ్యులైన కాంట్రాక్టు, అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కోతకు గురైన ఏటిగట్టును పరిశీలించారు. ఏటిగట్టుల శాఖ అధికారులతో మాట్లాడే ప్రయత్నం చేయగా వారు వెంటనే రాకపోవడంతో గట్టుపై బైఠాయించి ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ పనులకు వినియోగించిన రాళ్లు ప్రభుత్వ సర్టిపై చేసిన క్వారీవి కావన్నారు. ఈ కారణంగానే చేపట్టిన పనులు నీటిపాలయ్యాయన్నారు. వైసీపీ అవినీతికి ఏటిగట్టే పనులే నిదర్శమన్నారు. దీనిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. 'నాలుగున్నరేళ్లలో నరసాపురం అభివృద్ధికన్నా.. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద రాజు అవినీతే ఎక్కువ. గత ప్రభుత్వం తిరస్కరించిన క్వారీ నుంచి రాళ్లు తీసుకొచ్చి పనులు చేపట్టారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ రాళ్లు వాడించారు. దీనివల్లే వరద రాకున్నా, చేసిన పనులు గోదావరిలో కలిసిపోయాయి. రూ.26 కోట్లతో చేపట్టే ఈ పనులకు ఎమ్మెల్యేనే బినామీ కాంట్రాక్టర్. ఏటిగట్టు కొట్టుకు పోవడానికి నైతిక బాధ్యత వహించి ఎమ్మెల్యే ముదునూరి రాజీనామా చేయాలి. కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని బండారు మాధవనాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 20లోపు ఎమ్మెల్యే స్పందించకపోతే 21 నుంచి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏటిగట్టు పనుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు స్పష్టం చేశారు. శనివారం ఏటిగట్టు పనులను ఆయన పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. సర్టిపై చేసిన క్వారీ రాళ్ళనే వాడుతున్నాం. గతంలో ఏటిగట్టు 11 మీటర్లు మాత్రమే ఉండేది. దానిని 48 మీటర్ల వెడల్పు పెంచాం. నది లోపల 60 అడుగుల నుంచి రాళ్లు వేసి గట్టును పటిష్ఠ పరుస్తున్నాం. లోతైన ప్రాంతంలో రాళ్లు వేయడం వల్ల ఇలా కొట్టుకుపోవడం సహజం. తిరిగి రాళ్లు వేస్తూ స్థిరపడి అడుగుభాగం గట్టిపడే వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయి. దీనికి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని స్పష్టం చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావు, తహసీల్దార్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన ప్రాంతంలో రాళ్లు వేస్తున్న ఎక్స్‌కవేటర్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మాధవ్, ధర్నా చేస్తున్న పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు



కలెక్టరేట్ వద్ద ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

## ఉరితాళ్లు బిగించుకుని అంగన్‌వాడీల నిరసన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 13: రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించ కుండా మొండిగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ సమ్మె 33వ రోజులో భాగంగా కలెక్టరేట్ వద్ద శనివారం మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం జరిగిన చర్చల్లో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేదిశగా ఆలోచన చేయకుండా సమస్యలను జఠిలం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల జూలైలో వేతనాలు పెంచాలని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన వాగ్దానాన్ని ఎన్నికల్లోపు పూర్తి చేయకుండా దాటవేయటం అవకాశ వాదానికి నిదర్శనమ న్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడారు. ఏపీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలారాణి, దళిత నాయకులు ఎం.మహంకాళి, సీఐటీయూ నాయకులు సోమయ్య, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు



ఏలూరు క్రైం, జనవరి 13: ప్రజలందరూ కుటుంబ సభ్యుల నడుమ సంక్రాంతి పండుగను సంస్కృతి, సంప్రదాయాలతో జరుపుకోవాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి జిల్లా ప్రజల జీవితాల్లో నూతన వెలుగు, సంతోషాలు నింపాలని, చెడును భోగి మంటల్లో వేస్తూ, రానున్న రోజుల్లో అంతా మంచి జరగాలని ప్రతి కుటుంబంలో భోగభాగ్యాలు నింపాలని ఆమె కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, జూద క్రీడలకు వెళ్లి కుటుంబాలకు ఆనందం దూరం చేయవద్దని సూచించారు. పేకాట, కోడిపందేలు చట్ట విరుద్ధమన్నారు.

## ఎన్నికల తరువాత జగన్ జైలుకే..

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి



మాట్లాడుతున్న శ్యామ్ చంద్రశేషు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 13 : ఎన్నికల అనంతరం జగన్ జైలుకే పరిమితం అవుతారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా కోర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి సీఐడీ కార్యాల యానికి పలిపించి వేధించడం దుర్మార్గమన్నారు. గతంలో ఉన్న 38 కేసులతో జగన్ జీవితాంతం జైలుకే పరిమితం అవుతాడని అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ మాట్లాడుతూ, జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. నంబూరి రామచంద్రరాజు, చేను ప్రసాద్, కాశాని ప్రసాద్ పాల్గొన్నారు.

## బాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

లింగపాలెం, జనవరి 13: మండల కేంద్రమైన లింగపాలెంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎం. మల్లికార్జున్‌రావు, ఐటీడీపీ అధ్యక్షుడు తాతిన రాధాకృష్ణ మాట్లాడుతూ, చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో సైకో పాలన కొనసాగుతోంద విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు తెలపాలని అన్నారు.

## ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

పెదవేగి, జనవరి 13: తెలుగు ప్రజలకు 2024లో రెండు పెద్ద పండుగలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి సంక్రాంతి కాగా, మరొకటి ఎన్నికలని పేర్కొన్నారు. టీడీపీ అఖండ విజయం సాధిస్తుందని, సీఎంగా చంద్రబాబు అవుతారని, అప్పుడే తెలుగు ప్రజలకు నిజమైన సంక్రాంతి అని అన్నారు. టీడీపీ - జనసేన కూటమి విజయం ఖాయమన్నారు.

## పొగాకు రైతులను ఆదుకోవాలి

జీలుగుమిల్లి, జనవరి 13 : ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పొగాకు రైతుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాములవారిగూడెం లో శనివారం పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. పొగాకు బోర్డు నిధి నుంచి ఒక్కో రైతుకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.రాంబాబు, సిహెచ్.శ్రీనివాసరావు, బి.వీరసత్యం ఉన్నారు.



భీమడోలులో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

# సమస్యలు పరిష్కరించాలి

**33వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె**

చింతలపూడి, జనవరి 13 : ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం సమ్మె, నిరసన కొనసాగించారు. ప్రాజెక్టు జేఏసీ నాయకురాలు పి.సరోజిని మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి జీతాలు పెంచుతామని, అది కూడా ఎంత పెంచుతామో చెప్పబోమని చెప్పడం మోసం చేయడమేనన్నారు. కవిత, శ్యామల, సరళ, తదితరులు పాల్గొన్నారు.


● టి.నరసాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు హెల్పర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం జోక్యం చేసుకుని తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పి. పనివర్ధిని, ఎస్. మార్తమ్మ, ఎం. సత్యవతి, బాబి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి పలు పార్టీల నాయకులు విచ్చేసి తమ మద్దతు తెలిపారు. జనసేన పోలవరం ఇన్‌చార్జి చిర్రి బాలరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సీఐటీయు మండల కార్యదర్శి కొండలరావు, నాగమణి, సీపీఐఎంఎల్ నేత వెట్టి సబ్బన్న, ప్రజా సంఘాల నేతలు ఉన్నారు.

● ఉంగుటూరు: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సీఐటీయూ నాయకులు గూడపాటి నరసింహారావు, ఆర్.లింగరాజు, సంఘం మండల అధ్యక్షులు సీరా అప్పారావు తదితరులు సంతకాల సేకరణ నిర్వహించారు.

● భీమడోలు : అంగన్‌వాడీల సమ్మె శనివారం 33వ రోజుకు చేరింది. కార్యకర్తలు, ఆయాలు కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. సీఐటీయూ నాయకులు లింగరాజు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం 14 వేల మంది బడుగు, బలహీన వర్గాల అంగన్‌వాడీలపై కక్షసాధింపు చర్యలు చేపడుతుందన్నారు. పండుగ అనంతరం ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నేతలు రాజామణి, స్వర్ణకుమారి, చల్లా మణి పాల్గొన్నారు.

● లింగపాలెం : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 33వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు మాట్లాడుతూ చర్చల పేరుతో పిలుస్తూ అవమానానికి గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేఎస్ కుమారి, ఈశ్వరి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ఉంగుటూరులో కోటి సంతకాల సేకరణలో సీఐటీయూ నేతలు

# క్రికెట్ స్టేడియాలు కావు.. కోడి బరులు!



జీలుగుమిల్లిలో కోడిపందేల బరి



కామయ్యపాలెంలో .

**సంక్రాంతి సంప్రదాయం ముసుగులో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డే అండ్ నైట్ కోడిపందేలు వేసేందుకు నిర్వాహకులు బరులను తీర్చిదిద్దారు. కోర్టు, పోలీసు హెచ్చరికలు బేఖాతర్ చేస్తూ చకచకా బరులు సిద్ధం చేసేశారు. తగ్గేదేలే అంటూ పండుగ మూడు రోజులు పందేల నిర్వహణకు అనుమతులు వస్తామని పందెం రాయుళ్లు ధీమాగా ఉన్నారు. ప్రతి ఏడాదిలాగానే కోడే గెలుస్తుందని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.**

» కోడిపందేలకు బరులు సిద్ధం
» జూదాలకు తెరతీసిన నిర్వాహకులు
» అనుమతులొస్తాయని పందెంరాయుళ్ల ధీమా
» పోలీసు హెచ్చరికలు బేఖాతర్

బుట్టాయగూడెం, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు నిర్వహించేందుకు పందెం రాయుళ్లు బరులు సిద్ధం చేశారు. ఏజెన్సీలో బరులను చూస్తుంటే క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే పందెంరాయుళ్ల కోసం సర్వం సిద్ధం చేశారు. దుద్దుకూరులో బరి క్రికెట్ స్టేడియాన్ని తలదన్నుతోంది. డే అండ్ నైట్ పందేల కోసం ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. పందేలను చూడటానికి మూడంచెలుగా కర్రలు పాతారు. పందెంరాయుళ్లు మాత్రమే లోపల ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఒకపక్క పోలీసులు హెచ్చరికలు జారీచేస్తున్నా మరోపక్క పందెంరాయుళ్లు తగ్గేదేలే అంటూ బరులు చకచక సిద్ధం చేస్తున్నారు. పండుగ మూడు రోజులు పందేల నిర్వహణకు అనుమతులు వస్తాయని పందెంరాయుళ్లు ధీమాగా ఉన్నారు. బుట్టాయగూడెం, కంసాలికుంట, కొమ్ముగూడెం, దుద్దుకూరు, దొరమామిడి, అంతర్వేదిగూడెం, రాజానగరం, పీఆర్‌గూడెం, రెడ్డిగణపవరం, వెలుతురువారిగూడెం, అచ్చియ్యపాలెం ప్రాంతాల్లో పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం చర్యలు తప్పవంటున్నారు. చివరికి కోడే గెలిచేలా ఉంది.

● నిడమర్రు: పోలీసులు, కోర్టులు ఎన్ని అడ్డంకులు పెట్టిన కోడిపందేలు వేసేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సరదా పేరుతో నిర్వహిస్తున్న ఈ కోడిపందేలలో నిర్వాహకులు జూదం ఆడిస్తున్నారు. గతంలో బరుల్లో గుండాట నిమిత్తం రూ.50 లక్షల వసూలు చేయగా నేడు రూ.35 లక్షలు వసూలైనట్టు సమాచారం. భువనపల్లి, పెదనింద్రకొలను, ఛానమిల్లి, తోకలపల్లి గ్రామాలలో ప్రధాన పందేలు నిర్వహణకు రంగం సిద్ధమౌతోంది.

● కొయ్యలగూడెం: మండలంలోని రామానుజపురం, గవరవరం, పరింపూడి, పొంగుటూరు, రాజవరం, బయ్యన్నగూడెం, యర్రంపేట, దిప్పకాయలపాడు తదితర గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించడానికి నిర్వాహకులు బరులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలీసులు ఎన్ని నిబంధనలు పెట్టినప్పటికి మూడురోజులు కోడిపందేలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు భారీగా తరలి వస్తున్నారు. వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## జనసేన కార్యకర్తలకు అధికార పార్టీ నేతల బెదిరింపులు?

జీలుగుమిల్లి, జనవరి 13 : జీలుగుమిల్లిలో జనసేన కార్యకర్తలు బరి సిద్ధం చేయటంతో వైసీపీ నేతలు వారిపై వాగ్వాదానికి దిగారు. జనసేనానులకు అధికారపార్టీ నేతలతోపాటు పోలీసుల నుంచి బెదిరింపులు వచ్చాయి. ఈ విషయమై ఎస్ఐ వి.చంద్రశేఖర్‌ను అడగ్గా కొందరు నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. 102 బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కామయ్యపాలెం, పి.అంకంపాలెం, తాటియాకులగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో కోడిపదేల బరులు సిద్ధం చేశారు. మరో వైపు తెలంగాణ రాష్ట్రం బంధువులు ఆంధ్రా సరిహద్దులో పందేల వైపు మొగ్గు చూపటంతో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారనుంది. ఇదిలా ఉండగా, కొందరు పందెం రాయుళ్ల అధికార పార్టీ నేతలకు నగదు ముట్టచేప్పే కార్యకలాపాలు సాగించారు. పోలీసులకు- పందెంరాయుళ్లకు మధ్య వారధిగా పనిచేశారు. కొంతనగదు ఇప్పటికే చేతులు మారింది. బరుల వద్ద గుండాట కోసాట, మూడు ముక్కలాటకు నిర్వాహకులకు వారు ఇప్పటికే ముడుపులు చెల్లించినట్టు సమాచారం. బరుల వద్ద కంచెలు వేసి, సర్వంసిద్ధం చేస్తున్నారు.

## కోడిపందేలు, జూదం నేరం



బ్రోచర్లు అందజేస్తున్న ప్రతినిధులు

కామవరపుకోట, జనవరి 13 : తడికలపూడి పోలీసులు, రెవె న్యూ సిబ్బంది సంయుక్తంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటో ద్వారా కోడి పందేలు, జూదాలకు వెళ్లవద్దంటూ ప్రచారం చేశారు. పలు సెంటర్లలో యువకులకు బ్రోచర్లను అంద చేశారు. ఎస్ఐ జయబాబు, తహసీల్దార్ డి.వి.సత్య నారాయణ మాట్లాడుతూ, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దనీ, పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు, గండిగూడెం, కె.ఎస్.రామవరం, పోలాసి గూడెం, జీలకర్రగూడెం, కంఠమనేనివారిగూడెం, కొల్లువారిగూడెం, గుంటుపల్లి, కామవరపుకోట, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

● పెదపాడు: కోడిపందేలు, జూదం చట్టరీత్యా నేరమని కొక్కిరపాడు సర్పంచ్ మరీదు రెడ్డియ్య తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో వాటి వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. గంగాధర్, వీఆర్వో పుట్టా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా సంక్రాంతి సంబరాలు

ఏలూరు రూరల్, జనవరి 13: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ధర్మబేరీ ప్రాంగణంలో వ్యాపారవేత్త నారా శేషు పర్యవేక్షణలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గులు తెలుగువారి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. ఈనెల 15న విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. స్థానిక తంగెళ్ళమూడి సూర్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థి, విద్యార్థినిలు ఆటపాటలతో అలరించారు. రంగవల్లులు, సైకిల్ పోటీలు నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేశారు. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు, బి.శ్రీనివాస్, నున్న స్వాతి తదితరులు పాల్గొన్నారు.



పెదపాడులో బహుమతులు అందజేస్తున్న టీడీపీ-జనసేన నాయకులు



కామవరపుకోటలో టీడీపీ నేతలు..

● ఏలూరుకార్పొరేషన్ : అగ్రహారం రామకోటి ప్రాంగణంలో జనసేన ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగిమంటలు వేయడం, రంగవల్లులు, హరిదాసుల సంకీర్తనలు, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు జరిపారు. విజేతలకు బహుమతులను అందచేశారు. రెడ్డి అప్పలనాయుడు, ఘంటశాల వెంకటలక్ష్మి, కె.కె.గుప్త, తవ్వా అరుణకుమారి, సిరిపల్లి ప్రసాద్, బి.వి.రాఘవయ్యచౌద, నగిరెడ్డి కాశీ నరేష్, శ్రావణగుప్త, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను, బొత్స మధు, అల్లు సాయిచరణ్ పాల్గొన్నారు.

● పెదపాడు: అప్పనవీడులో టీడీపీ - జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గాలిపటాలు, గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు వేషధారణలు, పిండివంటలతో సంక్రాంతి శోభను సంతరించుకుంది. విజేతలకు రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. వాసవి, రామసీత, రామారావు, చంటి, సురేష్, మోగంటి పవన్, భార్గవ్ పాల్గొన్నారు.

● చింతలపూడి : పాత చింతలపూడిలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజనోత్సవాలను జిల్లా కో-కన్వీనర్ టి.రాజు ప్రారంభించారు. గత ఏడు సంవత్సరాలుగా యువతకు కబడ్డీ, ముగ్గులు, పరుగు పోటీలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. టి.బాబు, ఇమ్మానియేల్, నాగభూషణం, పరదేశి పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ ఆధ్వర్యంలో మండలంలోని గుంటుపల్లి పంచాయతీ కోదండరామనగర్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులను అందచేశారు.



ఏలూరు శనివారపు పేట స్కూల్లో ముగ్గుల పోటీలు



పాలు పొంగిస్తున్న విద్యార్థినులు



ఏలూరులో విజేతలకు బహుమతులు



కీర్తనలు ఆలపిస్తున్న శ్రీలాస్య

## అలరించిన సాహిత్యోత్సవం

ఏలూరు రూరల్, జనవరి 13: స్థానిక సాహిత్య ఆకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సాహిత్య మండలి కార్యక్రమంలో భాగంగా మూడోరోజు శనివారం అన్నమాచార్యుల సంకీర్తనలు, సంగీత వాయిద్య సమ్మేళనం అలరించాయి. మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబోట్ల పురుషోత్తమరావు ఆధ్వర్యంలో తొలుత సంక్రాంతి వైభవం ప్రవచనం నిర్వహించారు. తదుపరి శ్రీలాస్య అన్నమాచార్య సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించింది. తదుపరి ముగ్గులు, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, పెదపాటి రామకృష్ణ, కానాల రామకృష్ణారావు, ఖాజా వలీ, టి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కిలారు సత్యనారాయణ, బేతిన వెంకట్రావు, పల్లి శ్రీను, గోరింకదాసు, కంఠమనేని అంజిమూర్తి, కె.పుష్పరాజ్యం, యాళ్ళ లీలాప్రశాంతి పాల్గొన్నారు.

● నిడమర్రు : జనసేన ఆధ్వర్యంలో భువనపల్లి లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. గంగిరెద్దుల నృత్యాలు అలరించాయి. వంగా రఘురామచంద్రశేఖర్, తోట శ్రీను, నిమ్మల మౌనిక, సంకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రామారావు

## సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

టి.నరసాపురం, జనవరి 13 : యువత సాంప్ర దాయ క్రీడలకు ప్రాధాన్య త ఇవ్వాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్టా రామారావు అన్నారు. మర్రిగూడెం పంచాయ తీ గట్టుగూడెంగ్రామంలో తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. రామారావు మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో యువత చెడు వ్యసనాలను బానిసలు కాకుండా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. 12 టీమ్‌లు పాల్గొనగా మర్రిగూడెం పంచాయతీ పరిధిలోని తీగలపల్లి టీమ్ మొదటి స్థానం, ఏపీగుంట పంచాయతీ పరిధిలోని రామమ్మగూడెం టీమ్ రెండో స్థానం సాధించాయి. కుంజా లోకేష్, చంద్రరావు, రాజు, వెంకటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలపై అవగాహన

లింగపాలెం, జనవరి 13: మండలంలోని ఆసన్నగూడెం తువ్వచిలుక, రాయుడుపాలెం గ్రామాల్లో శనివారం ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.ఎస్.ఎస్ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి లక్షా 50వేలు ఉచితంగా ఇస్తున్నామని, ఉచిత గ్యాస్, జల్‌జీవన్ ద్వారా తాగునీరు అందజేస్తున్నట్టు వివరించారు. నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు ఏసువరప్రసాద్, యాంజీలో దిడ్లా, కుర్రా వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ పాల్గొన్నారు.

## డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గం

చింతలపూడి, జనవరి 13 : డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. మండల అధ్యక్షులుగా పి.అనంతకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మణికిషోర్, గౌరవ అధ్యక్షులుగా వి.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు కె.కాంతారావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ అధ్యక్షులు కె.సురేష్ పాల్గొన్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

## డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు, జనవరి 13 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సులకు దూర విద్య దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కరస్పాండెంట్ కె. ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు స్థానిక కళాశాలలో సంప్రదించాలని, వివరాలకు 87900 66123ను సంప్రదించాలని కోరారు.

## శాస్త్రోక్తంగా లక్ష తులసీపూజ



శ్రీవారి సన్నిధిలో లక్ష తులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 13: స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి భక్తులు సామూహికంగా లక్ష తులసీపూజను నిర్వహించారు. తొలుత తిరుప్పావై ప్రవచనలు, గోవిందనామ సంకీర్తనలు, పాశురాల పారాయణ, విష్ణు సహస్రనామ భగవద్గీత పఠనం నిర్వహించారు. శ్రీవారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళావేదికపై తెనాలికి చెందిన నోరి నారాయణమూర్తి శ్రీ హనుమద్ వైభవం ప్రవచనం నిర్వహించారు. స్థానిక బి.కె.బిందు, బి.కె.సింధు సోదరీమణులు అన్నమాచార్య గానామృతాన్ని నిర్వహించారు. నీరజ కూచిపూడి నృత్య అకాడమి ప్రిన్సిపల్ ఎ.నాగమణి బుద్ధదేవ్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు కోసూరి భక్తులతో పూజలు చేయించారు.

## అట్టహాసంగా ధనుర్మాస ఉత్సవం



తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామి

ద్వారకా తిరుమల, జనవరి 13 : శ్రీవారి ధనుర్మాస ఉత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. స్వామి, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి పురవీధుల్లో ఊరేగారు. గజ, అశ్వ సేవల నడుమ జరిగిన ఈ ఉత్సవం భక్తులను అలరించింది. విలాస మండపంలో కొలువుదీరిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

## అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



శ్మశానవాటికను ప్రాంభించిన ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు జనవరి 13 : దాతల సహకారంతో గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధి చేయడం అభినందనీయమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. భువనపల్లిలో శనివారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. గ్రామ సచివాలయం, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్, సీసీ రోడ్డు, మంచినీటి చెరువుకు పైప్‌లైన్ పనులు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభించారు. సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు హామీ మేరకు రూ.39 లక్షలతో శ్మశానవాటికలో రెండు పొయ్యిలు, విశ్రాంతి మందిరం, మంచినీటి చెరువు, స్నాన, పశుపతినాథుని మందిరం ప్రారంభించారు. ఎమ్మెల్యే వాసుబాబు, గాదిరాజు సుబ్బరాజు, వెల్లంకి నరేష్‌కుమార్, వీరరాఘవులు, ధనకొండ ఆదిలక్ష్మి, సంకు సత్యకుమార్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధితోనే ఆర్థిక స్వావలంబన



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెదవేగి, జనవరి 13 : గ్రామాల అభివృద్ధితోనే ఆర్థిక స్వావలంబన సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. లక్ష్మీపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని స్థలదాతలతో కలిసి శనివారం ప్రారంభించారు. రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.40 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్, రూ.20 లక్షలతో నిర్మించిన డ్రెయిన్‌ను ప్రారంభించి, రూ.60 లక్షలతో అభివృద్ధి చేయనున్న వీరంపాలెం-నాగులదేవునిపాడు రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. 54మంది లబ్ధిదారులకు వైఎస్సార్ శాశ్వత భూహక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఘంటా పద్మశ్రీ ప్రసాద్, తాతా రమ్య, అప్పన కనక ప్రసాద్, మేకా కనకరాజు, గంగాధరరావు, పీవీ సుబ్బారావు, చెరుకూరి ప్రసాదరావు, లక్ష్మణరావు, ఎస్.నాగరాజు, మనోజ్ పాల్గొన్నారు.

## 88 మందికి ఆయుర్వేద వైద్య సేవలు



మందులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 13 : అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్య నిపుణులు బి.వి.ఎం.నగేష్ 88 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. అల్లం వెంకట సుబ్బారావు, చెన్నా వెంకట్రామయ్య, బొలిశెట్టి సురేష్‌కుమార్, బి.పండరీనాథ్ సేవలు అందించారు.

## రైల్వే గేట్ కీ మేన్ సమయస్ఫూర్తి..
## ప్రాణాలు దక్కించుకున్న ఆటో ప్రయాణికులు



గేటుకింద నుంచి దూరివెళ్తున్న జనం

ఏలూరు క్రైం, జనవరి 13 : ప్రమాదం అని తెలిసినా కొంత మంది ఆటో డ్రైవర్లు ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూనే ఉన్నారు. ఒక్కక్షణం ఆగితే సురక్షితంగా ప్రయాణం కొనసాగించవచ్చుననే ఆలోచన లేకుండా ఎంత వరకూ ముందుకు వెళ్లిపోవాలనే ఉద్దేశంతోనే ఆటోలు నడపడంతో క్షణ క్షణం భయంతోనే ప్రయాణం చేస్తున్నారు. రైలు వస్తుందని ముందస్తుగా ఏలూరు పవర్‌పేట గేటు కీ మేన్ ఐదు నిముషాల ముందు నుంచే హెచ్చరిక సైరన్ మోగించి ఆ తరువాత గేటు వేయడానికి ఉపక్రమించాడు. ఏ మాత్రం లెక్క చేయకుండా ఓ ఆటో డ్రైవర్ రావడంతో ఆ గేటు ఆటోపైకి వచ్చి ఆగిపోయింది. చివరకు కీ మేన్ సమయస్ఫూర్తితో గేటును కొంత తప్పించడంతో ఆటో వెనక్కు వెళ్లింది. ఆ క్షణంలోనే రైలు వచ్చేసింది. కీ మేన్ సమయస్ఫూర్తితో వ్యవహరించకపోతే ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయేవని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## సీనియర్ న్యాయవాది సింహాద్రి మృతి



సింహాద్రి కిషోర్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 13 : బార్ అసోసియే షన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది సింహాద్రి కిషోర్‌కుమార్ శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ తీవ్ర సంతాపం తెలి పింది. కిషోర్ కుమార్ భౌతికకాయాన్ని అచ్యుత శ్రీనివాస రావు, తల్లాడి అశోక్ కుమార్, ఎ.వి.వి.భువనేశ్వరి, మేకా ఈశ్వరయ్య, పి.ఎస్.ఆర్.కే.లక్ష్మణరావు, టి.ఎస్.ఎన్. మూర్తి, రామమోహనరావు, మాదేపల్లి క్రాంతికుమార్, ఉద్దండం ఏసుబాబు, కోటేశ్వర రావు, శ్రీనివాస్, బల్లే సాయి కుమారి, తోట పద్మిని, దగ్గు కృష్ణ సందర్శించి నివాళులర్పించారు.



పెరికేగూడెం వద్ద కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరి

# బరులివిగో..

- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- కోడి పందేలకు సిద్ధమవుతున్న బరులు
- తెర వెనుక నేతలు
- లక్షల్లో పందేలు.. బంపర్ ఆఫర్లతో అట్రాక్షన్

**కోడిపందేలు నిషేధమంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా వాటిని బేఖాతరు చేస్తూ కోడి పందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. పలు గ్రామాల్లో బరులతో పాటు పందెం రాయుళ్ల కోసం షామియానాలు వేసి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు బుల్లెట్ వాహనం బహుమతిగా ఇస్తామన్న ఆఫర్లు జోరందుకున్నాయి. గెలుపు అధికారులదో.. పందెం నిర్వాహకులదో చూడాలి.**

మండవల్లి, జనవరి 13: ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పందేలు యథావిధిగా సాగుతాయంటూ నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. ఒకవైపు పోలీసు, రెవెన్యూ అధికారులు కోడిపందేలు, జూదం నిషేధమని హెచ్చరిస్తున్నా నిర్వాహకులు పట్టించుకోకపోవడం శోచనీయం. మండలంలోని చావలిపాడు, చింతపాడు, పులపర్రు, ఇంగిలిపాకలంక, పెరికేగూడెం, భైరవపట్నం తదితర గ్రామాల్లో కోడిపందేలు నిర్వహణకు బరులు సిద్ధం చేశారు. వరుసగా 5 లేదా 10 పందేలు కొట్టిన వారికి బుల్లెట్‌ను గిఫ్ట్‌గా ఇస్తున్నారంటే ఆ పందేలు ఎన్ని లక్షలు మేరకు ఉంటాయో అంచనాలు వేయవచ్చు. కోడిపందేలు నిర్వహణను సొమ్ము చేసుకునేందుకు కొల్లేటి లంక గ్రామాలు గ్రామ కట్టుబాట్లు ముసుగులో బరులు నిర్వహణకు లక్షల్లో వేలం నిర్వహించినట్లు తెలిసింది. పందేల నిర్వహణకు కొందరు రాజకీయ ప్రముఖులు తెర వెనుక ఉండి నడిపిస్తున్నట్లు సమాచారం. అందువల్లే నిర్భయంగా పందేలకు రావచ్చంటూ నిర్వాహకులు పందెం రాయుళ్లకు ఆహ్వానాలు పంపుతున్నారు.



కలిదిండిలో సిద్ధం..

**కైకలూరు:** కైకలూరు మండలం ఆటపాక, భుజబలపట్నం, చటాకాయ్, శృంగవరప్పాడు, పందిరిపల్లిగూడెం గ్రామాల్లో బరులను ఏర్పాటు చేస్తున్నారు. బరి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. జూదంలో పాల్గొనేవారికి ఏ ఇబ్బందులు లేకుండా అన్నిరకాల ఏర్పాట్లను నిర్వహిస్తున్నట్లు సమాచారం. పోలీసుల అనుమతులు లేకున్నా బరులు సిద్ధమవడం శోచనీయం.



ఆటపాకలో సిద్ధమవుతున్న బరి

**కలిదిండి:** కలిదిండి, తాడినాద, సానారుద్రవరం, కొండంగి, పెదలంక గ్రామాల్లో కోడి పందేల బరులను సిద్ధం చేశారు. టెంట్‌లు వేశారు. బిర్యానీ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళలో కూడా పందేలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో బరులను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**ముదినేపల్లి:** మండలంలోని అల్లూరు, ముదినేపల్లి, పేరూరు గ్రామాల వద్ద ఇప్పటికే బరులు సిద్ధం కాగా, బొమ్మినంపాడులో బరి ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఒకపక్క పోలీసులు కోడి పందేలను అడ్డుకునేందుకు విస్తృత స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మరోపక్క పందేల నిర్వహణకు నిర్వాహకులు వెనుకంజ వేయటం లేదు. దీంతో పందేలను అడ్డుకోవటం పోలీసులకు సవాల్‌గా మారింది.

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని వడాలి, చిగురుకోట, దేవపూడి, గురజ గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, జూదాల నిర్వహణకు బరులు సిద్ధం చేశారు. ఆయా స్థలాల్లో షామియానాలు, కుర్చీలు, పందెంరాయుళ్ళకు సౌకర్యవంతంగా ఉండేందుకు తాగునీరు, ఫ్లడ్‌లైట్‌లు ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పందేల నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## పెద్దింటమ్మకు కృష్ణాజిల్లా న్యాయాధికారి పూజలు



కైకలూరు, జనవరి 13: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని కృష్ణాజిల్లా న్యాయాధికారి అరుణ సారిక దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు ఆమెను సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. కైకలూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వీవీఎస్‌వీ లక్ష్మి, జూనియర్ సివిల్ న్యాయాధికారి పి. గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో సహాయమాత ఆలయం

## సహాయ మాత ఉత్సవాలు ప్రారంభం

ఆగిరిపల్లి, జనవరి 13: ఈదర సహాయ మాత ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం పతాకావిష్కరణతో మొదలైన ఉత్సవాలు 24వ తేదీ రాత్రి భారీ బాణసంచా వెలుగులతో ముగుస్తాయి. 22, 23, 24న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## పెదలంకలో సంక్రాంతి సంబరాలు



కలిదిండి, జనవరి 13 : పెదలంకలో శనివారం ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.50 వేలు విలువ గల బహుమతులను నిర్వాహకులు అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం, నాయకులు దుగ్గిరాల రంగారావు, పోకల వెంకటేశ్వరరావు, వీరాస్వామి, దున్న భోగేశ్వరరావు, ఇమ్మానేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వెంకటాద్రిపురం చెరువులో మట్టి తోలకాలు నిర్వహిస్తున్న దృశ్యం

## జగనన్న కాలనీల పేరుతో మట్టి తోలకాలు

- తహసీల్దార్‌కు గ్రామస్థుల ఫిర్యాదు
- నిలుపుదల చేసిన రెవెన్యూ అధికారులు

నూజివీడు టౌన్, జనవరి 13 : చెరువులో నీరు ఖాళీ అయిందో లేదో జగనన్న కాలనీల పేరుతో తిరిగి మట్టి తోలకాలకు తెరతీశారు. అధికారులకు జగనన్న కాలనీ ఇళ్లకు మట్టి తరలిస్తున్నట్టు నమ్మబలికి ఏకంగా మట్టి విక్రయాలకు తెరతీశారు. నూజివీడు మండలం హనుమంతులగూడెంలో జగనన్న కాలనీ మట్టి తోలకాలకంటూ అన్నవరం శివారు వెంకటాద్రిపురం చెరువు నుంచి అనుమతులు తీసుకున్న కొందరు కాలనీకి మట్టి తోలకుండా గ్రామంలో వివిధ ప్రాంతాలకు మట్టి తోలకాలు చేపట్టారు. దీంతో వెంకటాద్రి పురం గ్రామస్థులు తమ అవసరాలకు అనుమతులు ఇవ్వడం లేదు. పక్క గ్రామాలకు జగనన్న కాలనీల పేరుతో మట్టి విక్రయాలు చేపట్టడంపై నూజివీడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రెండు గ్రామాల వీఆర్వోలను పంపి మట్టితోలకాలు నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## ఓటీపీలపై చర్యలేవీ..?

- పోలీసులపై ఎమ్మెల్యే ప్రతాప్ ఆగ్రహం

నూజివీడు టౌన్, జనవరి 13: టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో ఓటీపీల విషయమై నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శనివారం నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఓటీపీలు అడిగిన వ్యక్తులపై చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలు వర్తిస్తాయంటూ ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారంటూ తాను పింఛన్ మంజూరు సభల్లో నియోజకవర్గ ప్రజలకు అవగాహన కల్పించి ఓటీపీలు అడిగే వారిని పోలీసులకు అప్పగించమని పేర్కొన్నానని ఈ నేపథ్యంలో నూజివీడు మండలంలో కొందర్ని పోలీసులకు అప్పగించగా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా సంబంధిత ట్యాబ్‌లను తిరిగి వారికి ఇవ్వడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అంశాలపై పోలీస్ శాఖ సమగ్ర విచారణ చేయాలని ప్రతాప్ తెలిపారు.

## జగన్‌కు శిక్ష వేస్తే ఏడు జన్మలు అనుభవించాలి

- నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 13: జగన్‌రెడ్డి నేరాలకు శిక్షవేస్తే ఏడు జన్మలకు సరిపడా శిక్ష పడుతుందని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెత్తందారీ పోకడలపై అధికార ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారన్నారు. దీంతో ప్రజల దృష్టిని మళ్ళించేందుకు జగన్ సీఐడీని అడ్డు పెట్టుకుని చంద్రబాబునాయుడుపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ తనపై ఉన్న కేసులపై అత్యధిక వాయిదాలు తీసుకున్న వ్యక్తిగా జాతీయస్థాయిలో రికార్డు సాధించాడన్నారు. ఐదు నగరాల్లో అదిరిపోయే ప్యాలెస్‌లు ఆయనకు ఎలా వచ్చాయో ప్రజలకు వివరించాలన్నారు. సంక్రాంతి ప్రజలకు అష్టైశ్వర్యాలను తీసుకురావాలని, పండుగను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

## తాత్కాలిక రహదారి పునరుద్ధరణ

- పలుమార్లు సొంత సొమ్ముతో నిర్మాణం
- నేటికీ ఒక్క పైసా రాలేదని సర్పంచ్ ఆవేదన



ముసునూరు, జనవరి 13: బలివే తమ్మిలేరుపై తాత్కాలిక రహదారిని సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో విజయరాయి వైపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం రహదారిని పునరుద్ధరించారు. మూడేళ్ళలో ఆరుసార్లు తమ్మిలేరు ఉధృతికి తాత్కాలిక రహదారి కొట్టుకుపోగా, ప్రతిసారి సర్పంచ్ సుమారు రూ 1.50 లక్షలతో రహదారిని పునరుద్ధరించారు. అయితే నేటికి ఒక్క రూపాయి కూడా సంబంధిత అధికారులు ఇవ్వలేదని సర్పంచ్ అన్నారు. ప్రతి ఏటా లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోందని, సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.





కలిదిండిలో మౌనంగా నిలబడి.. ముసునూరులో నోటికి నల్లరిబ్బన్‌లు కట్టుకుని అంగన్‌వాడీల నిరసన

# మాపై ఈ పగేల..?

- అంగన్వాడీల ఆక్రోశం
- వినూత్న రీతిలో నిరసనలు
- పలువురి సంఘీభావం
- 33వ రోజుకు సమ్మె

కైకలూరు, జనవరి 13: పదేపదే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కైకలూరులో 33వ రోజు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్. మీనాకుమారి, ఝాన్సీ, పూజిత, రమణ, ఉష తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా వారిపై బెదిరింపులకు పాల్పడటం శోచనీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి విమర్శించారు. శనివారం ముదినేపల్లిలో ఆయన దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతూ నెల రోజులకుపైగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమన్నారు. యూనియన్ నాయకులు సొంగా మణి, బండి పద్మ, సూరపనేని అరుణ కుమారి తదితరులు ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.

**కలిదిండి:** తమ సమస్యలపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావటంతో శనివారం కలిదిండిలో అంగన్‌వాడీలు మౌనంగా నిలబడి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ నేతలు అబిదా బేగం, మేనక లక్ష్మి, విజయలక్ష్మి, సునీత, మావుళ్లమ్మ, రంగమ్మ, పద్మ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్లు పాల్గొన్నారు.

### సంతకాల సేకరణ

**చాట్రాయి:** తమ ఉద్యమానికి మద్దతుగా అంగన్వాడీలు చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం చాట్రాయిలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు ప్రజలంతా అండగా నిలవాలని అభ్యర్థించారు. యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మల జ్యోతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

### నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని..

**ముసునూరు:** తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనాన్ని అంగన్‌వాడీలకు ఇస్తానని సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వర్కర్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి డిమాండ్ చేశారు. ముసునూరులో 33వ రోజు శనివారం అంగన్‌వాడీలు నోటికి నల్లరిబ్బన్‌లు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలను సైతం దృష్టిలో పెట్టుకోకుండా మిగిలిన హామీలను నేరవేర్చుతామని, వేతనాలపై పీటముడి వేయడం దారుణమన్నారు. దీక్షలో కె.విద్యావతి, మేరి సులోచన, శ్యామల, దుర్గ, బట్టరాజు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగులమైతే గౌరవ వేతనమేంటి?

**నూజివీడు టౌన్:** పథకాల అమల్లో ప్రభుత్వ ఉద్యోగస్తులంటూ తమకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్న ప్రభుత్వం జీతాల అమల్లో మాత్రం గౌరవ వేతనం అనడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్ చేశారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్ష 33వ రోజుకు చేరింది. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఆర్ హనుమాన్లు, జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీలకు టిక్కెట్ ఇవ్వాలి

కైకలూరు, జనవరి 13: స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా రాజకీయంగా ఎస్సీలకు న్యాయం జరగడం లేదని, రానున్న ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం ఎస్సీలకు అన్ని పార్టీలు టిక్కెట్లు కేటాయించాలని సాధన రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పి. ఏసుపాదం డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 29 శాతం ఎస్సీ ఓటర్లున్నారని, అయినా వారికి తగు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు.

## వేణుగోపాలస్వామికి ప్రముఖుల పూజలు



కైకలూరు, జనవరి 13: ఆచవరంలోని వేణు గోపాలస్వామి ఆలయ 95వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రతిఏటా భోగి పండుగకు ముందురోజు వార్షికోత్సవాలను నిర్వహిస్తుండటం ఆనవాయితీ. వేరే ప్రాంతాల్లో ఉన్న గ్రామానికి చెందిన ఆడపడుచులంతా వచ్చి స్వామివారిని పూజిస్తారు. స్వామివారిని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బీకేఎం నాని తదితరులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



## పేద విద్యార్థులకు క్షత్రియ సేవా సమితి వితరణ

కైకలూరు, జనవరి 13: క్షత్రియ సేవాసమితి ద్వారా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు తెలిపారు. శనివారం కైకలూరులో 32 మంది పేద విద్యార్థులకు రూ.3 లక్షలు అందజేశారు. క్షత్రియ సేవా సమితి ద్వారా రూ.1.40 లక్షల స్కాలర్‌షిప్, కైకలూరుకు చెందిన వ్యాపారి నడింపల్లి మూర్తిరాజు మనవడు కార్తీక్ వర్మ ఆర్థిక సాయంతో రూ.1.60లక్షలను విద్యార్థులకు అందజేశారు. సేవాసమితి కార్యదర్శి సూర్యనారాయణరాజు, కోశాధికారి దండు ప్రసాదరాజు, గౌరవ అధ్యక్షులు జంపన రామలింగరాజు, పొత్తూరి వెంకట నరసింహరాజు, నంబూరి వెంకటపతిరాజు, ములగపాటి దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.



యల్లాపురంలో కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

## టీడీపీతోనే ప్రజా సంక్షేమం

ముసునూరు, జనవరి 13: టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని సత్యనారాయణ అన్నారు. శనివారం యల్లాపురంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలసి నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఏటా సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను పలు నిబంధనలతో తగ్గించి అవినీతికి పాల్పడిన వ్యక్తి జగన్ అన్నారు. టీడీపీ అమలు చేసిన అన్ని పథకాలు అమలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని పర్వతనేని కోరారు. నాయకులు రావూరి మాధవరావు, బాలయ్య, ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోదా కల్యాణం

కైకలూరు, జనవరి 13: ధనుర్మాసోత్సవాల సందర్భంగా కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని తిలకించాలని కోరారు.

## అక్షింతల పంపిణీ



ముదినేపల్లి, జనవరి 13 : పెద గొన్నూరు కోదండ రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. దేవస్థానం నిర్వాహకుడు శ్రవణం శ్రీనివాసరావు దంపతులు గ్రామస్థులు అయోధ్య రామాలయ అక్షింతలను ఊరేగించి పంపిణీ చేసిన అనంతరం అర్చకుడు వెంకటేశ్వర బాబు ఆధ్వర్యంలో గోదా కల్యాణం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో ముగ్గుల పోటీలు

## పోలీస్ స్టేషన్ ఆవరణలో ముగ్గుల పోటీలు

ఆగిరిపల్లి, జనవరి 13: ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, నూజివీడు డీఎస్పీ అశోకకుమార్‌గౌడ్ ఆదేశాలతో ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేసినట్టు ఎస్సై నంబూరి చంటిబాబు తెలిపారు. భావితరాలకు సంప్రదాయం తెలపాలనే ధ్యేయంతో ముగ్గుల పోటీ నిర్వహించామని ఎస్సై తెలిపారు.

## జనసేన ఆధ్వర్యంలో...

చాట్రాయి, జనవరి 13: నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పణిబాబు ఆధ్వర్యంలో చాట్రాయిలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పణిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతురావు, బీజేపీ నాయకుడు ఆదిమూలం నాగమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథస్వామి ఆలయంలో ముగ్గుల పోటీలు

ముదినేపల్లి రూరల్, జనవరి 13: వడాలి జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఎం.తేజశ్రీ, రెండో బహుమతి కె.కుమారి, తృతీయ బహుమతి ఎ.మన్విత గెలుచుకున్నారు.




## క్రైం కార్నర్

### ఊక ట్రక్కు బోల్తా.. యువకుడి దుర్మరణం

మండవల్లి, జనవరి 13: పెరికేగూడెం వద్ద ప్రమాదవశాత్తు ఊక ట్రక్కు బోల్తా పడడంతో గుడివాడ నాగవరప్పాడు వైఎస్సార్ కాలనీకి చెందిన గద్దం దానియేలు కుమారుడు అనిల్‌కుమార్ (17) మృతి చెందాడు. శనివారం తెల్లవారజామున గ్రామస్థులతో కలసి ట్రాక్టర్‌లో ఊక లోడ్ చేసుకొని వెళ్తుండగా పెరికేగూడెం వద్ద ట్రాక్టర్ బోల్తా పడటంతో అతను ఊకలో చిక్కుకుపోయాడు. స్థానికులు అతనిని బయటకు తీసి, కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తెలంగాణ మద్యం సీజ్



ఆగిరిపల్లి, జనవరి 13: ఆగిరిపల్లిలో తెలంగాణ మద్యం అమ్ముతున్న పరసా ప్రసాద్ అనే నిందితుడిని అరెస్టు చేశారు. నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్సై చంటిబాబు సిబ్బందితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని నూజివీడు కోర్టులో హాజరుపరిచారు. అతని నుంచి మొత్తం 324 సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.



భుజబలపట్నంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## అ'పూర్వ' సమ్మేళనం

కైకలూరు, జనవరి 13: కైకలూరు మండలం భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో 1998-99 బ్యాచ్‌కు చెందిన టెన్త్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు పండుగను పురస్కరించుకొని స్వగ్రామాలకు తరలివచ్చారు. 40 మంది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు.

## పాఠశాల 60 వసంతాల వేడుకలు

కలిదిండి, జనవరి 13 : కోరుకొల్లు జడ్పీ హైస్కూల్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం పూర్వ విద్యార్థి, రిటైర్డు ఎంఈవో వట్టూరి రమణారావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు హాజరై గురువులను సత్కరించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ మంత్రి కామినేని, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, జనసేన నాయకులు వలవల రమేష్, కేశిరెడ్డి బలరామ్, విశ్రాంత ఎంఈవో రమణారావు, సర్పంచ్ లీలా కనకదుర్గ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

## జనసేన సంక్రాంతి కానుకల వితరణ



ముదినేపల్లి, జనవరి 13 : ముదినేపల్లి మండలంలో పేదలకు జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బీవీ రావు శనివారం సంక్రాంతి కానుకలు అందజేశారు. బియ్యంతో పాటు 9 రకాల నిత్యావసర సరుకులను స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 750 సంచులను అందజేశారు. పార్టీ మండల నాయకులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, అంబుల భరత్, వడ్లాని ఆంజనేయులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తలారి రాజేష్, యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకుడు విజయకుమార్

## సచివాలయ భవనాలు ప్రారంభం

చాట్రాయి, జనవరి 13: మండలంలో తుమ్మగూడెం, పోతనపల్లి గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. అనంతరం పోతనపల్లి దళితవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ నిర్మల, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నూజివీడు టౌన్, జనవరి 13: ఆచార్య ప్రబోధానంద సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నూజివీడు మండలం మీర్జాపురం, దిగవల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత సారాంశం, సంక్రాంతి విశిష్టతలను వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై పోలీసుల దూకుడు

ముదినేపల్లి, జనవరి 13 : అనధికార మద్యం అమ్మకాలపై ముదినేపల్లి పోలీసులు మరింత దూకుడు పెంచారు. ఎస్పీ ఆదేశాల మేరకు బెల్టుషాపుల నిర్వహణకు బ్రేక్ వేసేందుకు పోలీసులు నడుం బిగించారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గత పది రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి తొమ్మిది మంది బెల్టుషాపు నిర్వాహకులను అరెస్టు చేసి సుమారు 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగకుండా తగదాలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు.


జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

## అంతర్వేదిలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పూజలు

అంతర్వేది, జనవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి శనివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## శ్రీవారి సేవలో జస్టిస్ శేషసాయి


ఆలయం ముందు జస్టిస్ శేషసాయి

తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దినేష్ కుమార్, జస్టిస్ వెంకటేష్ నాయక్ కూడా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

## భృంగి వాహనంపై శ్రీశైల మల్లన్న

- బ్రహ్మోత్సవాలతో పరవశించిన శ్రీగిరి



శ్రీశైలం, జనవరి 13: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం లోకకళ్యాణం కోసం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు భృంగివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణవాహన సేవ నిర్వహిస్తారు.

## మల్లన్న సన్నిధిలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు


స్వామివారి భృంగివాహనసేవలో పాల్గొన్న జస్టిస్ దుర్గాప్రసద్‌రావు

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మల్లికార్జునస్వామి, అమ్మవార్ల భృంగివాహనసేవలో పాల్గొన్నారు.

## ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గం ఏకగ్రీవం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 13: ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఎన్నికల అధికారి అన్సారీ శనివారం తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు కర్నూలులో జరిగాయి. ఈ సందర్భంగా రెండో జాతీయ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఇంద్రశేఖర్ మిశ్రా (బిహార్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి (ఆంధ్రప్రదేశ్) ఎంపికయ్యారు. జనరల్ సెక్రటరీగా సదానందగౌడ్ (తెలంగాణ), వర్కింగ్ జనరల్ సెక్రటరీగా అన్సారీ (మహారాష్ట్ర), కోశాధికారిగా జోసెఫ్ సుధీర్‌బాబు (ఆంధ్రప్రదేశ్), ఉపాధ్యక్షులుగా టి.సుబ్రహ్మణ్యం (తమిళనాడు), శుబోద్ దత్తు (పశ్చిమ బెంగాల్), గంగారాం (రాజస్థాన్), వీరేంద్ర చౌహాన్ (హిమాచల్‌ప్రదేశ్), సురేంద్ర కుమార్ (పంజాబ్), కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్ (యూపీ), అష్రఫ్ షేక్ (జమ్మూకశ్మీర్), మనోశర్వాజ్ (హర్యానా) ఎంపికయ్యారు. మూడేళ్లపాటు ఈ కమిటీ కొనసాగనుంది. ఏఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గంలో తెలుగు రాష్ట్రా ల నుంచి ముగ్గురు ప్రతినిధులు ఎంపిక కావడంపై ఎస్టీయు ఏపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# సీఐడీ కార్యాలయాలకు చంద్రబాబు

- ఇసుక, మద్యం, ఐఆర్ఆర్ కేసుల్లో సొంత పూచీకత్తులు సమర్పణ
- కేంద్ర కార్యాలయంలో ఇస్తామన్న టీడీపీ కుదరదంటూ 3 చోట్లకు తిప్పిన అధికారులు
- టీడీపీ అధినేతపై వైఖరి మార్చుకోని వైనం



కుంచనపల్లిలో కార్యకర్తల కోలాహలం మధ్య చంద్రబాబు కాన్వాయ్, అభివాదం చేస్తున్న చంద్రబాబు

విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి/గుంటూరు: టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ సీఐడీ అధికారులు మరోసారి తమ వైఖరి ప్రదర్శించారు. ఇసుక, మద్యం, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్(ఐఆర్ఆర్) కేసులకు సంబంధించి హైకోర్టు ఆదేశాలతో పూచీకత్తులు సమర్పించేందుకు వచ్చిన చంద్రబాబును మూడు ప్రాంతాల్లో తిప్పారు. వాస్తవానికి సీఐడీ కేంద్ర కార్యాలయంలో అన్ని పూచీకత్తులు సమర్పిస్తామని టీడీపీ చెప్పింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా.. కానూరు, కుంచనపల్లి, గుంటూరుల్లోని మూడు కార్యాలయాల్లోనే సమర్పించాలని భీష్మించారు. దీంతో చంద్రబాబు శనివారం ఆయా కార్యాలయాలకు వెళ్లి పూచీ కత్తులు సమర్పించారు. టీడీపీ హయాంలో ఇసుక, మద్యం, ఐఆర్ఆర్ వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఏపీ సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో చంద్రబాబు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో గన్నవరానికి వచ్చి.. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. రూ.1.50 లక్షల వ్యక్తిగత పూచీకత్తును సీఐడీ అధికారులకు అందజేశారు. చంద్రబాబు తరఫున మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు సాక్షి సంతకాలు చేశారు.

### కుంచనపల్లిలో..

టీడీపీ అధినేత చంద్రబాబు తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో ఉన్న సీఐడీ(సిట్) అధికారులకు పూచీకత్తు సమర్పించారు. కుంచనపల్లి వద్ద టీడీపీ నియోజకవర్గ, స్థానిక నేతలు భారీగా హాజరై చంద్రబాబుకు స్వాగతం పలికారు. కాగా సిట్ ఆఫీస్ సమీపంలో పోలీసులు బారికేడ్లు అడ్డు పెట్టి మీడియాను రానివ్వకుండా అడ్డుకున్నారు.

### గుంటూరులో..

మద్యం కేసుకు సంబంధించి చంద్రబాబు శనివారం సాయంత్రం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు రూ.2 లక్షల చొప్పున పూచీకత్తులు సమర్పించారు. మద్యం కేసులో ఏ1 గా ఉన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ శ్రీనరేష్ శనివారం ఉదయమే పూచీకత్తులు సమర్పించి వెళ్లారు. ఈ కేసులో ఏ2గా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కూడా మధ్యాహ్నమే ష్యూరిటీలు సమర్పించారు. కేసు కోర్టు విచారణలో ఉన్న నేపథ్యంలో చంద్రబాబు ఆయా కేసులకు సంబంధించి మాట్లాడటానికి ఇష్టపడలేదు. గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో చంద్రబాబుకు జిల్లా కోర్టు సమీపంలో ఘన స్వాగతం పలికారు. కాగా, చంద్రబాబు సీఐడీ కార్యాలయానికి వెళ్లే సమయంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. చంద్రబాబు కాన్వాయ్‌తో వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట, స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నాయి.

### నిరంకుశ వైఖరి: నరేంద్ర

కానూరులోని సీఐడీ కార్యాలయం ముందు టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు విషయంలో సీఐడీ అధికారులు నిరంకుశంగా వ్యవహరించారని ఆరోపించారు. కానూరు, కుంచనపల్లి, గుంటూరు ఇలా మూడు చోట్ల వద్దని మంగళగిరిలో ఉన్న సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఈ పూచీకత్తులను తీసుకోవాలని అధికారులకు సూచించామని తెలిపారు. అయినప్పటికీ అధికారులు మూడు చోట్లా వ్యక్తిగత పూచీకత్తులు ఇవ్వాల్సిందేనంటూ చంద్రబాబును తిప్పారని ఆరోపించారు.

## సాలూరు వచ్చిన నిర్మలాసీతారామన్

సాలూరు, జనవరి 13: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణానికి కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం వచ్చారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో పాటు జిల్లా అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ తమ్ముడు పరకాల సుధాకర్ పట్టణంలోని కేవీఆర్ రియల్ ఎస్టేట్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల ప్రభాకర్ తల్లి కాళికాంబ (నరసాపురం మాజీ ఎమ్మెల్యే) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మరణించేవరకు చిన్న కుమారుడు సుధాకర్ వద్దే ఉండటంతో.. ఆమె 12వ రోజు కార్యక్రమాల్లో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆమె తిరిగి పయనమయ్యారు.

## హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా షర్మిల రెడ్డి

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మేడపాటి షర్మిలరెడ్డి నియమితులయ్యారు. రెండు సంవత్సరాలపాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు పదవీ కాలం ముగియడంతో ఇటీవలే ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. అయితే దొరబాబు వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



# చెల్లింపులు సగమే!

పండుగ వేళా రైతుకు అందని డబ్బు

- లక్ష్యం 37 లక్షలు.. కొన్నది 25 లక్షల టన్నులే!
- ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లతో.. మిల్లర్ల ఇష్టారాజ్యం
- కామన్ రకం బస్తాకు చెల్లించేది రూ.1300లే
- రవాణా, హమాలీల ఖర్చుల భారమూ రైతులపైనే!

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

సంక్రాంతి అంటేనే రైతు పండుగ. పంటలు ఇంటికి వచ్చి.. అవి అమ్మిన డబ్బులతో రైతులు ఆనందంగా జరుపుకొనే పండుగ. ఈ పండుగ వేళ కూడా ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతులు చేతిలో డబ్బులు లేక విలవిల్లాడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు డబ్బులు జమ చేయలేదు. ఆర్బీకేల ద్వారా 4,12,838 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం.. ఇప్పటివరకు సగం మంది రైతులకు మాత్రమే రూ.2,384 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు అప్పులు చేసి పండుగ జరుపుకోవాల్సిన దుస్థితిలో పడిపోయారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ పౌర సరఫరాల సంస్థ లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షలకుపైగా హెక్టార్లలో రైతులు వరి సాగు చేయగా.. మొత్తం 85 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పగా.. పీడీఎస్ అవసరాల కోసం 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు దాదాపు ముగిసిపోగా.. ఇప్పటివరకు ఆర్బీకేల ద్వారా 4,12,838 మంది రైతుల నుంచి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. అంటే ప్రభుత్వం లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోయింది. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఇప్పటికే పీకల్లోతు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేక చేతులెత్తేసింది. దీంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మళ్లీ యథావిధిగా రైసు మిల్లర్ల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. పీడీఎస్ అవసరాల కోసం రైతుల నుంచి ధాన్యాన్ని తప్పనిసరిగా ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే సేకరించాలని, ఇలా సేకరించిన ధాన్యాన్ని ర్యాండమ్ పద్ధతిలో రవాణా కాంట్రాక్టర్ల ద్వారా జీపీఎస్‌లు అమర్చిన వాహనాల్లో మాత్రమే రైసుమిల్లులకు తరలించాలని కేంద్ర సర్కారు నిబంధనలను విధించింది. అయితే వరి కోతలు ప్రారంభమయ్యే సమయంలోనే తుఫాను రావడం, ధాన్యం తడిసిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. ఇదే సదావకాశంగా అధికార పార్టీ నాయకులు, వారి కనుసన్నల్లో నడుస్తున్న రైసు మిల్లర్ల యజమానులు, దళారులు మోసాలకు పాల్పడుతూ దోపిడీకి తెరతీశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం 75 కేజీల ధాన్యం బస్తాకు రూ.1530 చెల్లించాల్సి ఉండగా.. దళారులు రూ.1200 నుంచి రూ.1300 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేల్లో గోనె సంచులు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొనడంతో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవడానికి రైతులు అనేక పాట్లు పడాల్సి వస్తోంది. ధాన్యం రవాణా, ఎగుమతి, దిగుమతులకు హమాలీ (జీఎల్‌టీ) చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని చెబుతున్నా.. ఎక్కడా వాటిని చెల్లించడం లేదు. దీంతో దళారులు జీఎల్‌టీ చార్జీల కింద బస్తాకు రూ.200 వరకు తగ్గించుకుని డబ్బులు చెల్లిస్తున్నారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఇచ్చిందే తీసుకుని ఉసూరుమంటున్నారు.

### రైసుమిల్లుల లారీల్లోనే ధాన్యం రవాణా

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి టెండరు ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రవాణా కాంట్రాక్టర్లను నియమిస్తుంది. ఈ టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆయా జిల్లాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది కేటాయించిన మిల్లులకు తరలించాలి. కానీ ఈ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకుండా రైసు మిల్లర్లు ముప్పుతిప్పలు పెడుతూ నష్టాలకు గురి చేస్తుండటంతో రవాణా కాంట్రాక్టర్లు పారిపోతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు ఒక్క జిల్లాలో కూడా లేకుండా పోయారంటే.. వారిపై మిల్లర్ల ప్రభావం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో చేసేదేమీ లేక సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు అదర్స్ పేరుతో రైసు మిల్లర్లకే ధాన్యం రవాణా బాధ్యతలు అప్పగించారు. దీంతో మిల్లర్లందరూ సిండికేట్‌గా ఏర్పడి.. మద్దతు ధరను భారీగా తగ్గించేయడంతోపాటు ధాన్యం రవాణా ఖర్చులను కూడా రైతుల నుంచే వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.




## భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య

- మృతురాలు బీఎస్ఎఫ్ ఉద్యోగి

పుల్లలచెరువు, జనవరి 13: జీవితాంతం తోడుంటానన్న భర్తే కాలయముడయ్యాడు. మానసిక బలహీనతో, కుటుంబ కలహాలో తెలియదు కానీ భార్యను చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఉదయం ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం నాయుడుపాలెంలో చోటుచేసుకొంది. బంధువుల కథనం ప్రకారం.. రాచర్ల మండలం, ఆగ్రహారానికి చెందిన జ్యోతికి పుల్లలచెరువు మండలం నాయుడుపాలేనికి చెందిన నారు వెంకటేశ్వరరెడ్డికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం జ్యోతి కేంద్ర సాయుధ దళం (బీఎస్ఎఫ్)లో ఉద్యోగం సంపాదించింది. ప్రస్తుతం ఆమె కోల్‌కతాలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి తరచూ గొడవలు జరుగుతున్నాయి. బంధువులు ఇరువురికి సర్దిచెప్పి శుక్రవారం నాయుడుపాలెంలోని అత్తగారింటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారు మళ్లీ ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో జ్యోతి(25) తలపై వెంకటేశ్వరరెడ్డి రోకలిబండతో కొట్టడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం వెంకటేశ్వరరెడ్డి(28) కూడా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పనికి వెళ్లి ఇంటికొచ్చిన వెంకటేశ్వరరెడ్డి తండ్రి ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా, అప్పటికే ఇద్దరు మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కృష్ణానదిలో దూకిన తోడికోడళ్లు

- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు
- అత్తింటి వేధింపులే కారణమని ఆరోపణ


రూపాదేవి, స్వాతి

పెదవేగి, జనవరి 13: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు తోటికోడళ్లు కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు యత్నించగా, ఒకరి మృతదేహం లభ్యమైంది. మరొకరి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం పినకడిమికి చెందిన రూపాదేవి (36), స్వాతి (33) తోటికోడళ్లు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన పాలపాటి కామరాజు, తిరుపతమ్మ కుమారులైన శ్రీనివాస్, సాయిశివను పెళ్లి చేసుకున్నారు. శ్రీనివాస్, రూపాదేవికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. సాయిశివ, స్వాతికి చదువుకుంటున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా వివాహం జరిగిననాటి నుంచి కట్నం కోసం నిత్యం వేధిస్తుండేవారని గ్రామస్థులు చెబుతున్నారు. శుక్రవారం వేధింపులు ఎక్కువ కావడంతో విసిగివేసారిన తోటికోడళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. విజయవాడ వెళ్లి శనివారం మధ్యాహ్నం ఇద్దరూ కృష్ణానదిలో దూకారు. కాగా.. స్వాతి మృతదేహం లభ్యమైందని, రూపాదేవి మృతదేహం కోసం గాలిస్తున్నారని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. ఈ ఘటనపై ఆగ్రహించిన మహిళల బంధువులు, అత్తింటిపై దాడికి దిగారు. రాళ్లు రువ్వి, ఇంటిని కొంతమేర ధ్వంసం చేశారు. శ్రీనివాస్, సాయిశివ పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.